క్లుప్తంగా

రేపు మూడు గ్రామాల్లో ప్రజాపాలన

తాండూరు రూరల్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అర్హుల నుంచి అర్జీలను స్వీకరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనను మంగళవారం మూడు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం బెల్కటూర్, కరన్‌కోట్, మధ్యాహ్నం ఓగిపూర్‌లో చేపట్టనున్నట్లు తెలిపారు. కావున అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సహాయం

మర్పల్లి: పేదింటి కూతురు వివాహానికి ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.కొండల్‌రెడ్డి, పట్లూర్ ఎంపీటీసీ స్వప్నలు ఆర్థిక సహాయం అందజేశారు. వికారాబాద్ మున్సిపల్ పరిధి గంగారం గ్రామానికి చెందిన ఎండీ మోయిజ్ తన కూతురు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్, ఎంపీటీసీ చేయూత నిచ్చారు.

వైభవంగా అయ్యప్ప పూజ



పూజచేస్తున్న అయ్యప్ప భక్తులు

దౌల్తాబాద్: మండల పరిధి ఇందాపూర్ గ్రామవాసి విష్ణు నివాసంలో ఆదివారం ఘనంగా అయ్యప్పస్వామి పూజ నిర్వహించారు. తొలుత గురుస్వాములు నర్సింహులు, దశరథ్, లాలు ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామితో పాటు అయ్యప్పకు అభిషేకం చేశారు. అనంతరం పడిని వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర



విశేష అలంకరణలో స్వామి వారు

మోమిన్‌పేట: మండల పరిధి చక్రంపల్లిలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అభిషేకం, ధ్వజారోహణం, పుణ్యవాచణం, స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు శివ స్తోత్రాలను వినిపించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకుల భక్తులకు అన్నదానం చేశారు.

దళారుల మాటలు నమ్మకండి

పెద్దేముల్: మహాలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని వచ్చే దళారులను ప్రజలు నమ్మరాదని తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజీరెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు మండల పరిధి ప్రాంతాల్లో కొందరు తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి వారు ఎవరైనా వస్తే పోలీసులకు లేదా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: టీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పలువురు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు సంగయ్య, సిద్ధిక్, లక్ష్మప్ప, సాయన్న, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

దోమ: సీఎస్‌సీ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దిర్సంపల్లి ఎంపీటీసీ నవాజ్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం దోమ మండలం దిర్సంపల్లి గ్రామంలో సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఆర్థికపరమైన లావాదేవీలను నిర్వహించుకునేందుకు సీఎస్‌సీ సెంటర్లు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు కృష్ణారెడ్డి, అశోక్, వెంకటయ్య, భగవంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కుమార్, జెగ్గు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పల్లకీ సేవ



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

సంబురంగా మల్లన్న జాతర

మల్లికార్జున స్వామి జాతర కనుల పండువగా కొనసాగింది. మండల పరిధి గౌతపూర్‌లో జరిగిన ఉత్సవంలో మల్లన్నను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి గంగస్నానం చేయించారు. అనంతరం పల్లకీలో ఊరేగించారు. సాయంత్రం బోనాలతో మహిళలు డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకొని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు రాంచెంద్రారెడ్డిలు ఉన్నారు. ఇందులో ఆలయ పూజారీ చంద్రయ్య స్వామి, సర్పంచ్ రాజప్ప, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

– తాండూరు రూరల్



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

దోమ: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధి గ్రామాల్లో డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు హీరాలాల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయండి

దోమ: జనవరి 2న ఉదయం 11 గంటలకు చేపట్టే తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని ప్రజాసంఘాల నాయకులు విజయవంతం చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల పరిధి దిర్సంపల్లి గ్రామానికి చెందిన కొంత మంది చెరువు శిఖం భూమి కబ్జాకు పాల్పడ్డారని, ఇదే విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా.. తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. ముట్టడిని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆందోళన కార్యక్రమానికి ప్రజాసంఘాల నేతలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు

- కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి
- బీజేపీ జిల్లా కోశాధికారి బస్వలింగం

మర్పల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కోశాధికారి బస్వలింగం కోరారు. ఆదివారం మండల పరిధి సిరిపూరం గ్రామంలో వికాస్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవగాహన లేమీతో గ్రామీణ వాసులు, నిరుద్యోగ యువత పథకాలను సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఆదేశాల మేరకు, యాత్ర ద్వారా సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సిరిపూరం, కోట్‌మర్పల్లి శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు లక్ష్మణ్, నాగయ్య, బలరాం గౌడ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడాలి

నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించండి: డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు రూరల్: శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆదేశించారు. ఆదివారం తాండూరు మండలం గౌతపూర్ శివారు కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గుట్కా, మట్కా, డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తూ.. శాంతి భద్రతలను పరిరక్షించాలని చెప్పారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సమస్యలతో ఠాణాకు వచ్చిన వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి, ఎస్ఐ–2 విమల ఉన్నారు.



ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. ఆదివారం పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సందర్భంగా విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. చదువుతో పాటు విద్యా సంస్థల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా క్రీడల్లో రాణించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు నర్సింహులు, వెంకటేశం, మల్లేశం, ప్రిన్సిపాల్ ప్రశాంత్, డైరెక్టర్ సతీశ్, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



వృద్ధురాలికి కంటి అద్దాలు అందజేస్తున్న సర్పంచ్ అంజయ్య

మోమిన్‌పేట: పల్లెల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం సంతోషకర విషయమని సర్పంచ్ అన్నారు. ఆదివారం మండల పరిధి చంద్రాయన్‌పల్లి గ్రామంలో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 38మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 12 మందికి శస్త్ర శికిత్స చేయాలని సూచించారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వినితా, స్వప్న, క్యాంపు కోఆర్డినేటర్లు క్రుతివిక, సునిత తదితరులు ఉన్నారు.

న్యూ ఇయర్ జోష్

కిటకిటలాడిన మద్యం, మాంసం దుకాణాలు

తాండూరు/ధారూరు/ అనంతగిరి: నూతన సంవత్సరం నేపథ్యంలో మాంసం, మద్యం దుకాణాలు ఆదివారం కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ధారూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో కేక్‌ల విక్రయాలు ముమ్మరంగా కొనసాగాయి. ఈ సందర్భంగా పోలీసులు భారీగా డ్రంకెన్‌డ్రైవ్‌లో చేపట్టి, వాహనాలను తనిఖీ చేశారు.



తాండూరులో వాహనాల తనిఖీ..



ధారూరులో కేకులు విక్రయిస్తున్న దుకాణ దారుడు

ఆయుర్వేదానికి ఆదరణ కరువు

- కొరవడిన నిర్వహణ లోపం
- వేధిస్తున్న ఔషధాల కొరత
- అల్లోపతికి చేరువవుతున్న రోగులు
- ఇబ్బందుల్లో ఆయుర్వేద ఉద్యోగులు

బొంరాస్‌పేట: ఆయుర్వేద వైద్యానికి ప్రజల్లో ఆదరణ కరువయింది. దీర్ఘకాల, స్వల్పకాల రోగాలతో బాధపడుతున్న వారు సైతం తక్షణ ఉపశమనాన్ని కోరుతూ.. అల్లోపతికే మొగ్గుచూపుతున్నారు. మొండి వ్యాధులను నయం చేసే గుణమున్న ఆయుర్వేదానికి గతంలో ఎంతో ఆసక్తి చూపేవారు కూడా.. ప్రస్తుతం ఇంగ్లీష్ వైద్యంవైపు మళ్లడం గమనార్హం. దీనికి కారణం నిర్వహణ లోపంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకోకపోవటమేనని తెలుస్తోంది. దీంతో ఆ రంగంలో కొనసాగుతున్న ఉద్యోగులకు పనిలేకుండా పోయింది. అడపా దడపా అందుతున్న వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారు.

ప్రజలకు అవగాహన లేదు

ప్రజారోగ్యం కోసం అల్లోపతితో పాటు ఆయుర్వేద వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రతి మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఐదేళ్లక్రితం ఏర్పాటు చేశారు. తొలుత 2008లో ఎన్ఆర్‌హెచ్ఎం ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ ఆయుష్ వైద్యశాలలు నెలకొలిపినప్పటికీ.. గ్రామీణ స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది ఐదేళ్ల క్రితమేనన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. వివిధ రోగాలతో బాధపడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, ఆయుర్వేద మందులతో నయం చేయడమే లక్ష్యంగా పీహెచ్‌సీకి అనుబంధంగా వైద్యశాలలను ఏర్పాటు చేశారు.



వైద్యశాలలో అరకొర మందులు(ఫైల్)

కానీ.. యునాని, అల్లోపతి వైద్యం లాగే చెట్లమందులతో జబ్బులను తగ్గించవచ్చునని విషయాన్ని ప్రజలకు అవగాహన చేయడంలో సంబంధిత అధికారులు విఫలం అయ్యారని, తద్వారా ఈ చికిత్స గురించి ప్రజలకు తెలియక పోవడంతోనే ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. నియోజకవర్గంలోని మద్దూరు, అంగడిరైచూర్, బొంరాస్‌పేటలో ఎన్ఆర్‌హెచ్ఎం నిర్వహణలో ఉన్నాయి.

ఆయుర్వేదిక్ ఉద్దేశం

గ్రామీణ స్థాయిలో ఆరోగ్య ఉప కేంద్రాల్లో పరీక్షించిన రోగులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించడం సహజం. అలా పంపించిన రోగులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదు చేసుకొని, రోగుల అభిప్రాయం మేరకు ఆయుర్వేద వైద్య చికిత్స చేయాలనే నిబంధన ఉంది! కానీ అలా ఎక్కడా జరగడం లేదని పరిసర ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ప్రతి వైద్యశాలకు సంవత్సరానికి రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు విలువైన ఆయుర్వేద మందులు అవసరమవుతాయి. ప్రస్తుతం నియోజకవర్గ పరిధి మండలాల ఆయుర్వేద కేంద్రాల్లో ఎక్కడా కూడా రూ.40వేలకు మించిన మందులు లేవన్నట్లు సమాచారం. ఏడాదికి ఒకసారి కూడా మందులు సరఫరా కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఆయుర్వేద వైద్యం కోసం వచ్చే రోగులకు సరిపడా మందులు లేక పోవడంతో, ఆయుర్వేద చికిత్సకు దూరం అవుతున్నట్లు తెలుస్తోంది. రుద్రారం, దుద్యాల, గుండుమాల్, దౌల్తాబాద్‌లో ఆయుష్ వైద్యశాలలు 1987 నుంచి కొనసాగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వలే ఉదయం 9 నుంచి 12, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సేవలు అందిస్తున్నాయి. వీటిల్లో ఔషధాల కొరత తీవ్రం. దాంతో పాటు ఏడాది కాంట్రాక్టు బేసిక్‌తో నియామకమైన సిబ్బంది, చాలీచాలని వేతనాలు, అవీ సకాలంలో అందక పోవడంతో వారూ సతమతమవుతున్నారు. నిర్వహణ లోపంతో వైద్యశాలలు బోసిపోతున్నాయి.

ఆయుర్వేదమే నయం



పూర్వం ఎంతటి మొండి వ్యాధికైనా ఆయుర్వేద వైద్యమే ఉండేది. ఇంగ్లిష్ మందులు వచ్చినప్పటి నుంచి ఆ విధానానికి ఆదరణ తగ్గింది. సత్వర ఉపశమనానికి అల్లోపతికి చేరువవుతున్న రోగులు, అనేక దుష్పరిణామాలు ఎదుర్కొంటున్నారు. ఆయుర్వేదంతో దీర్ఘకాలిక రోగాలు నయం కావడంతో పాటు, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవు.

– హన్మంతు, ఆయుర్వేద నిపుణులు, లింగన్‌పల్లి

ఏజీని కలిసిన ఏజీపీ



ఏజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏజీపీ

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన హైకోర్టు ఏజీపీ (అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్) ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదివారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా నియామకం కావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

మురుగునీటిలో భగీరథ పైప్‌లైన్



మురుగు కాలువ నుంచి తీసిన పైప్‌లైన్

ధారూరు: మండల కేంద్రం ఎస్సీ కాలనీలో షఫీ ఖురేషి ఇంటి నుంచి బండల బాలయ్య ఇంటి వరకు పంచాయతీ నిధులతో మురుగు పారే కాల్వ నుంచే పైప్‌లైన్ వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మురికి కాలువలో పైప్ లైన్ లీకేజీ అయితే తాగునీరు కలుషితమయ్యే అవకాశం లేకపోలేదని ఆదివారం కాలనీ వాసులు అభిప్రాయపడ్డారు. గత్యంతరం లేక నీటిని తాగుతున్నామని వాపోయారు. మోరీ నుంచి పైప్‌లైన్‌ను తొలగించాలని పలుమార్లు సర్పంచ్, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి, మరో దిశగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

తాండూరు టౌన్: గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన ఫారాలు కాంగ్రెస్ నాయకుల చేతుల్లో ఉండటాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్ సంగీతాఠాకూర్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం వార్డు పరిధి ప్రజలకు ఇంటింటికీ తిరుగుతూ దరఖాస్తు ఫారాలను అధికారులు అందజేస్తుండగా, కాంగ్రెస్ నాయకులు వాటిని తీసుకొని, వారికి కావాల్సిన వారికి ఇవ్వడం సరికాదని హితవు పలికారు. పార్టీల వారీగా విభజించి, పక్షపాత ధోరణితో చూస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులకు దక్కాలన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. తన వార్డు పరిధి ప్రజల దరఖాస్తులను కౌన్సిల్ స్వయంగా పూర్తి చేసి, అవగాహన కల్పించారు.



దరఖాస్తు ఫారాన్ని పూరిస్తున్న కౌన్సిలర్

దరఖాస్తు ఫారాల పంపిణీ



దోమ: ఫారాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందజేస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధి ఐనాపూర్ గ్రామంలో పలువురికి పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలు అర్హులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని, అందులో భాగంగానే ప్రజాపాలన ద్వారా అర్హుల నుంచి అర్జీలను స్వీకరిస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మేకల గోవర్ధన్, జాఫర్, గార్లమల్లి మల్లేశ్, కృష్ణయ్య, వెంకటయ్య, ఆనందం, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి

కుల్కచర్ల: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య కోరారు. ఆదివారం మండల పరిధి పీరంపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులను ఇంటింటికీ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



కుల్కచర్లలో..